నార్త్ జోన్‌లో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి -కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నార్త్ జోన్ 38వ డివిజన్‌లో పర్యటించారు. అక్కడి ప్రజల దగ్గరకి వెళ్లి రోజూ చెత్తను సేకరిస్తున్నారా, కాలువలలో ఉన్న పూడికలు తీస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రజలు రోడ్స్ డ్రెయినేజీ సమస్యలు చెప్పగా కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కొత్తగా నిర్మించుకుంటున్న ఇళ్లకు అనుమతి తీసుకోవాలని సంబంధిత యాజమాన్యానికి సూచించారు. కార్పొరేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి చుట్టూ పరిసరాలు, లోపల ఎప్పుడు శుభ్రంగా ఉండేలాగా చూసుకోవాలని ఆదేశాలిచ్చారు. వైఎస్ఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో మెగా చెక్ అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపు.. కనిపించని మినహాయింపు

- లభించని ఉపశమనం
- వినియోగదారుల ఆశలు ఆవిరి..
- పేద, మధ్య తరగతి ప్రజల్లో ప్రతిబింబించని జిఎస్‌టి
- ఓల్డ్ స్టాక్ పేరుతో పాత రేట్లకే విక్రయాలు
- అధికారుల పర్యవేక్షణ లోపం

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

తాజాగా జిఎస్‌టి విధానాల్లోని అవకతవకలను సరిచేస్తూ కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి–2ను ప్రకటించింది. ఈ విధానం ప్రకారం పలు వస్తువులకు ఇప్పటి వరకు అధికంగా విధించబడ్డ పన్నుల శాతాన్నిన తగ్గించారు. దీంతో పలు ముఖ్యమైన, నిత్యం వాడుకునే వస్తువులు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధానం సెప్టెంబరు 22 నుంచే అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం దుకాణాల వారు జిఎస్‌టి తగ్గింపును అమల్లోకి తీసుకు రాలేదు. ముఖ్యంగా నిత్యావసర సరుకుల విషయంలో ఈ తగ్గింపు ప్రజలకు చేరడం లేదు. ఆయా దుకాణాలు, మార్టులు జిఎస్‌టి తగ్గింపును అమల్లోకి తీసుకురాకుండా యథావిధిగా పాత రేట్లకే అమ్మతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం తగ్గించినప్పటికీ ఆయా ఫలాలు ప్రజలకు అందడం లేదు. ఈ విషయమై ఎవరికి ఫిర్యాదు చేయాలో ప్రజలకు కూడా అర్థం కావడం లేదు. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో కొన్ని దుకాణాలు ఆడింది ఆటగా పాడింది పాటగా జరిగిపోతోంది. జిల్లా వ్యాప్తంగా జిఎస్‌టి తగ్గింపు ప్రభావం ఇప్పటి వరకు ప్రజలకు కనిపించడం లేనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త రేట్లు అమలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ మార్కెట్‌లో మాత్రం వ్యాపారులు ఓల్డ్ స్టాక్ పేరుతో పాత రేట్లకే సరుకులు విక్రయిస్తున్నారు. ఈ కారణంగా వినియోగదారులు ఆశించిన ఉపశమనం అందక, తీవ్ర నిరాశాలో మగ్గుతున్నారు. వినియోగదారుల మాటల్లో చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం తగ్గించింది కాబట్టి తాము తక్కువ ధరలకు సరుకులు కొనుక్కోవాలని ఆశించారు కానీ, ఇప్పటికీ పాత రేట్లకే బిల్లులు వేస్తున్నారు. కొత్త రేట్లను అమలు చేయకపోవడం పట్ల ప్రభుత్వంపై ప్రజల నమ్మకం తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది..

మరోలా వ్యాపారుల వాదన

వ్యాపారుల వాదన వేరేలా వినిపిస్తుంది. తాము పాత రేట్లకే సరుకులు తెచ్చుకున్నట్లు వాటిని కొత్త రేట్లకు అమ్మితే నష్టం వస్తుందని వాపోతున్నారు. అయితే వినియోగదారులు దీన్ని అంగీకరించడం లేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజల కోసం, దాని ప్రకారమే విక్రయించాలని, జిఎస్‌టి తగ్గింపు ప్ర ప్రయోజనం రాకపోతే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. వ్యాపారులు ముందుగా కొనుగోలు చేసిన వస్తువులను పాత రేట్లలో విక్రయించడం వల్ల కొత్త జిఎస్‌టి రాయితీ వినియోగదారులకు చేరడం లేదు. వాటికి సైతం జిఎస్‌టి అన్వయిస్తేనే తాము వస్తువులను జిఎస్‌టి ప్రకారం విక్రయిస్తామని చెబుతున్నారు.

పర్యవేక్షణ లోపం

సంబంధిత అధికారులు మార్కెట్లలో ఆకస్మాత్తుగా తనిఖీలు చేసి, కొత్త రేట్ల అమలు జరుగుతోందా లేదా అని చూడాలి. కానీ ఇలా జరగడం లేదు. జిఎస్‌టి అమలు చేసినప్పటి నుండి సంబంధింత అధికారులు పర్యలేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కాబట్టి వెంటనే పర్యవేక్షించాల్సి బాధ్యత అధికారులపై ఉంది. మార్గదర్శకత లేకపోవడం, పాత స్టాక్ కొత్త రేట్లతో ఎలా అన్వయించుకోవాలి అనే స్పష్టత లేకపోవడం కూడా సమస్యను మరింత జఠిలం చేస్తోంది. దీనిపై ప్రజల ఆగ్రహం బయటపడుతోంది. ప్రభుత్వం తగ్గించింది అని వార్తల్లో మాత్రమే చూస్తున్నాం కానీ దుకాణాల్లోకి వెళ్లినప్పుడు మాత్రం అదే పాత రేట్లకు విక్రయిస్తున్నారు. మరి ఇది మోసం కాదా ఏమిటీ అని వినియోగదారులు మండి పడుతున్నారు. వారు స్పష్టంగా కొత్త రేట్లు అమలు చేయకపోతే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కిరాణాపై ఎలా ఉండేది?

కేంద్ర ప్రభుత్వం చెప్పేదాని ప్రకారం కిరాణా సామగ్రిపై గతంలో 18–12–5 శాతం ఇలా మూడు స్లాబ్‌లో జిఎస్‌టి పన్ను విధించగా తాజాగా దీన్ని కొన్ని వస్తువులపై పూర్తిగా తొలగించడంతో పాటు మరికొన్ని వస్తువులపై 5 శాతం వరకూ తగ్గించినట్లు చెబుతున్నారు. రోజువారీ నిత్యావసరాలపై గతంలో 12 శాతం, 18శాతం పన్నులు ఉండేవి. తాజాగా 5 శాతానికి తగ్గించినట్లు కేంద్రం చెబుతోంది. విశాఖ నగరంలో పాదరక్షలపై 12 శాతం జిఎస్‌టియే కొనసాగుతోంది. పలు షాపుల్లోకి వెళ్లే జనానికి దసరాతో చేదు అనుభవం ఎదురైంది. 12 శాతాన్ని కొత్త జిఎస్‌టి ప్రకారం 5 శాతం చేయాల్సి ఉంది. కానీ అమలు కావడం లేదు. పాత జిఎస్టి పద్ధతినే వ్యాపారులు అనుసరిస్తుండడం అనేక నిత్యావసర సరకుల విషయంలో కొనసాగుతోంది. ఒక షాపు యజమానిని ప్రశ్నించిన కస్టమర్లతో మాట్లాడుతూ 'ఇంకా సాఫ్ట్‌వేర్ అప్డేట్ కాలేదని, కొత్త స్టాక్‌తో కొత్త బిల్లులు వస్తే అప్పుడు అమలు చేస్తామంటూ ప్రస్తుతానికి పాత జిఎస్‌టితోనే సరకులు కొనాలంటూ చెబుతున్నారు. పాత ఎంఆర్‌పికే అమ్ముతామని తెగేసి చెబుతున్నారు.

జిఎస్‌టి 2.0తో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రచారాలు

2014లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధికారంలో ఉన్నప్పటికీ అంతర్జాతీయ క్రూడాయిల్ ధరల ప్రకారం ఏ రోజు కూడా పెట్రోల్ ధరలు తగ్గించబడలేదు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగినప్పుడు మాత్రం పెట్రోల్ ధరలు పెంచి దర్జాగా పెట్రోలియం కంపెనీలు దండుకున్నాయి. వాస్తవంగా అంతర్జాతీయంగా ఉన్న క్రూడాయిల్ ధరలను అనుసరించి పెట్రోల్ ఒక లీటర్ దాదాపు రూ.75 లకే ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికి రూ.110లు ఉందంటే ఎంత దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.. ఇవన్నీ సరిచేయకుండా ఎన్‌డిఎ ప్రభుత్వం జిఎస్‌టి 2.0 పేరుతో తగ్గింపులు చేశామని సంబరాలు చేసుకుంటూ ప్రచారాలకు దిగడం ప్రజలను నివ్వెరపరుస్తోంది. జిఎస్‌టి 2.0 అమల్లోకి వచ్చిన తరువాత ధరలు తగ్గినా ఇంకా పాత ధరలకే కొంత మంది అమ్ముతున్నట్లు సమాచారం.

పేరుకే జిఎస్‌టి తగ్గింపు

పేరుకే జిఎస్‌టి తగ్గించినారే తప్ప ఆచరణలో మాత్రం లేదు. నిత్యావసర వస్తువులు తగ్గిన జిఎస్‌టి స్లాబ్ ప్రకారం అమ్మడం లేదు. పాత రేట్ల ప్రకారమే విక్రయిస్తున్నారు. **- అమరావతి, గృహిణి, పులివెందుల**

అధికారులు చొరవ చూపాలి

అధికారులు చొరవ తీసుకొని తగ్గిన రేట్ల ప్రకారం వ్యాపారులు అమ్మేలా చూడాలి. అప్పుడే సామాన్య ప్రజలకి జిఎస్టి వల్ల ఉపయోగం ఉంటుంది.

- రామాంజనేయులు, చిరు ఉద్యోగి, పులివెందుల

పాత స్టాక్‌కు జిఎస్‌టి తగ్గిస్తే నష్టం

పాత స్టాక్‌కు జిఎస్టఇ తగ్గించి విక్రయిస్తే నష్టాలు వస్తాయి. కాబట్టి పాత ధర ప్రకారమే విక్రయిస్తున్నాం. కొత్త వస్తువులకు మాత్రమే జిఎస్‌టి తగ్గింపు ఉంది.

- రఘునాథ గుప్తా, జనరల్ స్టోర్, పులివెందుల

'కూటమి'కి బెత్తం దెబ్బ తప్పదు

- ఉపాధ్యాయ సంఘాల నాయకుల హెచ్చరిక

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

కూటమి ప్రభుత్వ తీరు మారకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల బెత్తం దెబ్బకు గురికాక తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇక్బాల్, ప్రవీణ్, కిరణ్ హెచ్చరించారు. శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరుబాట కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాప్టో చేపట్టిన నిరసన ర్యాలీ మహావీర్ సర్కిల్, కలెక్టరేట్ సర్కిల్ మీదుగా డిఇఒ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గత పాలకుల విధానాలనే ఈ ప్రభుత్వం సైతం కొనసాగిస్తుందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరొకలా పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని, ఉద్యోగుల అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను ఆరు నెలలలోగా చెల్లిస్తామని పేర్కొన్నారన్నారు. కూటమి పెద్దల హామీలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే, ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందన్నారు. పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లయినా ఆ ఊసే లేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నియమించిన 12వ పిఆర్‌సి చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ రాజీనామా చేసి ఏడాదైనా నూతన చైర్మన్‌ను నియమించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వాలు డిఎలు చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా జీవిస్తారని, ప్రతిపక్ష హోదాలో అప్పటి ప్రభు త్వాన్ని నిలదీసిన ఇప్పటి పాలకులు నాలుగు డిఎలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నా రన్నారని విమర్శించారు కార్యక్రమంలో నాయకులు బాలగంగి రెడ్డి, నరసింహారావు, చెన్నకేశవరెడ్డి, సాజిద్, గంగన్న, గాజులపల్లి గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, నరసిం హులు, శ్రీనివాసులు, ప్రకాష్ బాబు, కరిముల్లా, పద్మాకర్ పాల్గొన్నారు. **బద్వేలు :** విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభు త్వంపై పోరుకు సిద్ధమని ఫ్యాప్టో నేతలు మాదన విజయ కుమార్, జి.వి.సుబ్బారెడ్డి, చింతంరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని కోరారు. శనివారం బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యా యుల సమస్యల పరిష్కా రంలో పాలకవర్గాలు ఘోరంగా విఫలమవుతున్నాయని ఆరోపి ంచారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బం దులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తుందని ఆశించారన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరి మితం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటి ఎఫ్, ఎస్‌టియు, హెచ్‌ఎమ్‌ఎ సంఘాల నాయకులు కె.సుధాకర్, కె.శ్రీకాంత్, ఎం.సుబ్బ రాయుడు, ఎస్.దేవానందం, రమేష్ రాజా, టి.శ్రీనివాసులు, గంజి పెంచలయ్య, ఎస్.మస్తాన్ వలి, ఎద్దు జకరయ్య, వెంకట సుబ్బయ్య, పి.చక్రపాణి, మునెయ్య, లాజ రయ్య, కొండయ్య, శేషాద్రి, విజయ నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ఆటో ఎక్కి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం పులివెందులలో మంత్రి ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్, పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి , పాల్గొని పొలంగల్ సర్కిల్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పులివెందుల పట్టణం నడివీధులలో ఆటో డ్రైవర్లతో తెలుగుదేశంతో పాటు కూటమి నాయకులు పాల్గొని ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్‌పి, పులివెందుల జడ్‌పిటిసి మారెడ్డి లతా రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పాల్గొని డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కూటమి ప్రభుత్వంగా రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. 2024 ఎన్నికలలో భాగంగా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతోపాటు, మరికొన్ని హామీలు ఇచ్చామని చెప్పారు. ఆ హామీలన్నింటిని దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించి ఒకపక్క అమరావతి నిర్మాణం, మరోపక్క ప్రజల క్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు సమాజానికి సేవకులు, వారి జీవన ప్రమాణాలు పెంచే దిశగా ఈ పథకం ఒక చారిత్రాత్మక అడుగు అని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఆరోగ్య బీమా, పిల్లల విద్యా సాయం, వాహన మరమ్మతులకు సబ్సిడీ వంటి సౌకర్యాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని వారు తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి భరోసా కలిగించేలా ఈ పథకం అమలు చేస్తారని చెప్పారు. అనంతరం జిల్లాలోని ఆటో యజమాలకు ఆటో యజమానులకు రూ. 17.18 కోట్ల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేల పార్థసారథి రెడ్డి, శేషారెడ్డి, హజ్ కమిటీ మెంబర్ మా భాష, నల్లగారి భాస్కర్ రెడ్డి పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, ఇతర అధికారులతో పాటు, టిడిపి నాయకులు కార్యకర్తలు, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

నగరంలో ఆటో డ్రైవర్ల భారీ ర్యాలీ

కడప అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్, క్యాబ్ డ్రైవర్లకు రూ.15000 ఆర్థిక సాయం అందించే ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని కడప నగరంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో అప్సర సర్కిల్ నుంచి వైఎస్ఆర్ ఆడిటోరియం వరకు ఆటోవాలా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ర్యాలీలో పాల్గొని, ఆటోలో కాకి దుస్తులతో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నిరంతరం పేదల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఏడూ పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. సుపరిపాలన కొనసాగిస్తూ, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ, ఆటో డ్రైవర్ల ఆర్థిక అభివృద్ధికి ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబును మరువకూడదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనుచితం

ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇటీవలి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్యకర పోస్టులు పెట్టారనే ఫిర్యాదు ఆధారంగా డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా సోదరుడు, పిఎలతో పోలీసుల అనుసరించిన వైఖరి విమర్శలకు దారితీసింది. మహిళా ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడం ఫార్వర్డ్ చేయడం తప్పిదమే. పోలీసులు కేసు నమోదు చేయడం దగ్గర నుంచి కోర్టులో హాజరుపరచడం వరకు చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలు టిడిపి నాయకత్వానికి చేదు అనుభవాలను మిగిల్చింది. ఎన్నికల నాటి నుంచి మాజీ డిప్యూటీ సిఎంను కుటుంబాన్ని వ్యక్తిగతంగానూ, రాజకీయంగానూ టార్గెట్ చేయడం తెలిసిందే. ఎమ్మెల్యే మాధవి ఎటువంటి చిన్న అవకాశం దొరికినా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం తగదు. ఇటువంటి వైఖరులతో ప్రజల్లో పలుచన అవుతామనే వాస్తవాన్ని గ్రహించాలి. మరోవైపు డిప్యూటీ సిఎం సోదరుడిపై కేసు నమోదు చేసిన వ్యవహారంలో పోలీసుల దూకుడు వైఖరి అనుచితం. జిల్లా పోలీస్ ఉన్నతాధికారి ఆదేశాలను బేఖాతర్ చేసిన వ్యవహారంపై సంబంధిత సిఐపై వేటు వేసిన ఉదంతం తెలిసిందే. జిల్లా పోలీస్ ఉన్నతాధికారి వైఖరి సరైదేనని తేలిందని విశ్లేషకులు చెబుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సోషల్ మీడియా పోస్టుల కేసులపై స్పీడ్ పెంచితే ఇబ్బందులు ఎదురవుతాయని గ్రహించిన ఉన్నతాధికారి వైఖరిపై ప్రశంసనీయమనే వాదన వినిపిస్తోంది. సోషల్ మీడియా కేసులపై నోటీసులతో సరిపెట్టకుండా అరెస్టులు చేయడం ఏమిటని కోర్టు ధర్మాగ్రహం వ్యక్తం చేయడాన్ని చెంపపెట్టులాందనే చర్చ నడుస్తోంది. వ్యక్తిగతంగా ముందుకెళ్తే ఇబ్బందులు ఎదురవడంతోపాటు పలుచన అవుతామని సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలకులు కక్షపూరిత వైఖరులతో ముందుకెళ్తే బూమరాంగ్ అవుతామనే గ్రహించాలి. వ్యక్తిగత కక్షలు తమతోపాటు వ్యవస్థల పనితీరును సైతం దిగజార్చుతాయనే సంగతిని గ్రహించాలి. శుక్రవారం విజయవాడలో జరిగిన కేబినెట్ మీటింగ్‌లో మైలవరం రిజర్వాయర్ మరమ్మతుల కేటాయింపులను చూస్తే విస్తుపోవాల్సి వస్తోంది. జిల్లా నీటి పారుదలశాఖ మూడేళ్ల కిందట మైలవరం రిజర్వాయర్ మరమ్మతులకు ఉద్దేశించి రూ.80 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. తాజా కేబినెట్ సమావేశంలో గేట్ల మరమ్మతుల పేరిట రూ.3.19 కోట్లు మంజూరుకు పరిమితం చేసింది. రాబోయే మాసాల్లో తుఫానులు నెలకొనే అవకాశాలు ఎక్కువ. గండికోట రిజర్వాయర్‌లో గరిష్ట నీటిమట్టాన్ని నిల్వచేసిన నేపథ్యంలో మైలవరం, గండికోట ప్రాజెక్టులో కలిసిపోయింది. గేట్లు పనితీరును మెరుగుపరచాల్సిన వాస్తవమే. రాష్ట్రంలోని ముగ్గురు కూటమి నాయకులు హైదరాబాద్‌లో వారి ఇళ్లకు వెళ్లడానికి స్పెషల్ ఫ్లైట్లు, హెలికాప్టర్ల పర్యటనలకు వెచ్చిన ఖర్చుల్లో ఒక శాతం వెచ్చించినా మైలవరం రిజర్వాయర్ బ్యూటికేషన్, రివిట్‌మెంట్లతో కూడిన ఆధునికీకరణ పనుల్ని పూర్తి చేయడానికి అవకాశం ఉంది. కూటమి సర్కారు అభివృద్ధి పేరుతో సాగిస్తున్న ప్రచారాన్ని వాస్తవాల ప్రాతిపదికన సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎఆర్ డిఎస్‌పిగా పి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నూతన ఎఆర్ డిఎస్‌పిగా పి.నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు.1996 సంవత్సరంలో ఆర్‌ఎస్‌ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి విశాఖపట్నం రూరల్, విజయనగరం తదితర జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. 2010లో ఆర్‌ఐగా ఉద్యోగోన్నతి పొంది విజయనగరం పిటిసి, విశాఖపట్నంలలో పనిచేశారు. 2022లో డిఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. అనకాపల్లిలో ఎఆర్ డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు బదిలీపై వచ్చారు.

ఇపిఎఫ్, ఇఎస్‌ఐలపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఇపిఎఫ్, ఇఎస్‌ఐ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. కొప్పర్తిలోని పరిశ్రమలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారికి ఇపిఎఫ్, ఇఎస్‌ఐ అంశాలపై అవగాహన కలిగించారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, క్యాస్ట్, ఇన్‌కమ్, సదరన్ సర్టిఫికెట్లు, పిసి అండ్ పి ఎన్ డి టి చట్టం, బాల్య వివాహాలు, నల్సా పథకాలు, మధ్య వర్తిత్వం, లోక్ అదాలత్ లు వంటి అంశాలను వివరించారు. ఉచిత న్యాయ సాయం కోసం తమను సంప్రది ంచాలన్నారు. కార్యక్రమంలో జడ్జిలు, పారా లీగల్ వాలంటరీ ఈశ్వరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దశలవారి ఆందోళనలు

ప్రజాశక్తి - కడప

ఎస్ఇకి నోటీసు అందజేస్తున్న విద్యుత్ జెఎసి నాయకులు

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిమ ంచుకుంటే ఈ నెల 15 తరువాత ఏ క్షణమైనా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తామని విద్యుత్ జెఎసి నాయకులు పేర్కొన్నారు. శనివారం కడప జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణకు జిల్లా విద్యుత్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ యుఎస్‌కె బర్నబాస్, కన్వీనర్ ఎం.వి. చలపతి, నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో దశ ఉద్యమంలో భాగంగా ఈనెల 6న విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసు వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8న తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ వద్ద ధర్నా, 13న చలో విజయవాడ కార్యక్రమం, 14న వర్క్ టు రూల్ పాటిస్తామని అన్నారు. అప్పటికీ విద్యుత్ యాజమాన్యం తమ సమస్యలకు సానుకూల పరిష్కారం చూపకపోతే 15 తర్వాత ఏ క్షణమైనా మెరుపు సమ్మెకు వెళ్తాం అని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఫయాజ్ బేగ్, యాకోబు, రమేష్ రెడ్డి, పురుషోత్తం యూనియన్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు స్థానిక పోలీసుస్టేషన్‌లో పోరుమామిళ్ల సిఐ డి. శ్రీనివాసులు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్ప డరాదని పేర్కొన్నారు. పోలీసులు కూడా గట్టి నిఘా పెట్టారని పేర్కొన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. నేరం చేసే ముందు ఒక సారి తమ కుటుంబం గురించి ఆలోచించాలని, నేరాలకు పాల్పడి భార్యా పిల్లలను రోడ్డున పడేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఆ తరువాత బాధపడి ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎటువంటి చట్ట వ్యతిరేకమైన చర్యలు చేయకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో కలసపాడు ఎస్ఐ ఎల్.తిమోతి, పోలీసులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి- కడప అర్బన్

మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం జిఎస్‌టి విధానంలో కొత్తగా తెచ్చిన మార్పుల గురించి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్‌రెడ్డి రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ వస్తువు మీద కొత్త విధానంలో ఎంఆర్‌పిలో ఎంత మార్పు వచ్చింది, దాన్ని ఏ విధంగా లెక్కించాలి వంటి వంశాలపై జిఎస్‌టి క్యాలిక్యులేటర్ ద్వారా వివరించారు. జిఎస్‌టి ఫలితాలు ప్రజలకు చేరుతున్నాయో లేదో బిల్స్ చూసి సరిగా వస్తున్నాయో లేదో పరిశీలించారు. జిఎస్‌టి ఫలితాలు విని చివరి వినియోగదారానికి చేరకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ స్మార్ట్ బజార్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : సబ్ జైల్ దగ్గర ఉన్న మదరసా ఉస్మాన్ బిన్ అఫ్వాన్‌లో విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ జీవిత చరిత్ర పై రాత పరీక్ష పోటీలో పాల్గొన్న విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేయనున్నామని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మేయర్ ఎస్.ముంతాజ్ బేగంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. బహుమతి ప్రదానంతో పాటు ఆధ్యాత్మిక సమావేశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, ముస్లిం సోదరులు పాల్గొవాలని పేర్కొన్నారు.

నేడు ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

నాటకరంగ ప్రముఖులు, పలు నంది అవార్డుల గ్రహీత, సవేరా ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం ఆదివారం సాయంత్రం 5 గంటలకు కడప నేక్ నామ్ ఖాన్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాటక రంగం విభాగంలో ప్రముఖ సినీ రంగస్థల నటి డాక్టర్ జి.రత్నశ్రీ, లలిత కళల విభాగంలో యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావుకు ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య పోటీలు అనంతరం, శ్రీరామ పాదుకలు నాటకం, డాక్టర్ జి.రత్నశ్రీ చే చింతామణి రంగస్థల పద్యాలాపన ఉంటుందని తెలిపారు. కళాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ప్రయివేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిల్లాలో దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుంచి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకోవడంలో రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం వహించడం దారుణమని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సీజన్‌లో విచ్చలవిడిగా బస్సు టికెట్లను అధిక మొత్తంలో ప్రజల వద్ద నుంచి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని డిమాండ్ బట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతున్నా జిల్లాలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. డివైఎఫ్‌ఐ అధ్వర్యంలో కడప,ప్రొద్దుటూరు రవాణా శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని పేర్కొన్నారు. బహిరంగంగా ఆన్‌లైన్‌లో ఛార్జీలు రూ.2000,ఆ పైన ఛార్జీలు రేట్లు చూపిస్తున్నా చర్యలు శూన్యమని తెలిపారు. ముఖ్యంగా రెగ్యులర్ ఆర్‌టిఒ లేకపోవడంతో తనిఖీలు, చర్యలలో జాప్యం నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లా రెగ్యులర్ ఆర్‌టిఒను నియమించాలని తెలిపారు. జిల్లాలో హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్నంకు ప్రయివేట్ బస్సుల సర్వీసులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఇద్దరు డ్రైవర్లు ఉండాలని కానీ సింగిల్ డ్రైవర్లను రూటు సర్వీసులకు తిప్పుతూ డ్రైవర్లు పైన ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆటలాడాలంటే.. హైవే దాటాల్సిందే..!

బళ్లారి-నెల్లూరు హైవే దాటి వెళ్లాలంటే భయపడుతున్న విద్యార్థులు - రూ.2 కోట్లు ఖర్చు పెట్టినా ఉపయోగం శూన్యం

ప్రారంభానికి నోచుకోని నూతన భవనాలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వ్యాయామానికి సమయం కేటాయించాలంటే పెద్ద కసరత్తే చేయాల్సి వస్తుంది. రోజువారి తరగతులలో భాగంగా వ్యాయామం కోసం ఒక క్లాసును విద్యార్థులకు కేటాయిస్తున్నారు. ప్రస్తుత పాఠశాల సమీపంలో ఆటస్థలం లేకపోవడంతో నూతన పాఠశాల వద్దకు వెళ్లితీరాల్సిందే. ఆటస్థలానికి వెళ్లాలంటే బళ్లారి-నెల్లూరు హైవే దాటుకుని కిలోమీటర్ దూరం నడవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ప్రధాన రహదారి వెంబడి నిత్యం భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రతి తరగతికి చెందిన విద్యార్థులు ఆటస్థలానికి వెళ్లాలంటే అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఉన్న కాస్త సమయం ఆటస్థలం వెళ్లి వచ్చేందుకే సరిపోతుంది. నూతన పాఠశాల భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఈ సమస్య తలెత్తుతున్నది. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు ఎంతో సమస్యగా మారిన ఆటస్థలం, తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

గత ప్రభుత్వం ప్రారంభంలో నిర్మాణాలు..

ప్రారంభించిన పాఠశాల నూతన భవనాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రూ.2కోట్లపైగా వెచ్చించి నిర్మించిన భవనాలు వృథాగా మారాయి. అరకొరగా పూర్తయిన పాఠశాల భవనాల్లో అల్లరి మూకలు, మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రస్తుతం ఉన్న పాఠశాల ఆవరణలో ఆటస్థలం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు వ్యాయామ తరగతులకు దూరంగా ఉన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా నూతన పాఠశాల భవనాలను పూర్తిస్థాయిలో నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019లో నక్కలదిన్నె రోడ్డులో జిఎఎస్ హైస్కూల్‌కు సంబంధించిన సంబంధించిన 68/2ఏ/3ఎల్ సర్వే నెంబర్‌లోని 3.46 ఎకరాల భూమిలో నూతన పాఠశాల భవనాల నిర్మాణానికి ఆర్ఎంఎస్ఏ నిధుల ద్వారా రూ.54.8 లక్షలు, నాబార్డు నిధుల కింద రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసి 13 గదులు నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 8 గదులు నిర్మాణం పూర్తికాగా మరో 5 గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. పాఠశాల ప్రహరీ నిర్మించారు. తిరిగి నాడు-నేడు నిధుల ద్వారా 5 తరగతి గదులు మంజూరు కాగా మూడు గదులను నిర్మించారు. దాదాపుగా రూ.2.30 కోట్లను వీటి కోసం వెచ్చించారు. పూర్తిస్థాయిలో నిర్మించిన ఎనిమిది గదుల్లో ప్రస్తుతం కరెంటు బోర్డులను మందుబాబులు పగలగొడుతున్నారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమం కోసం ఆట స్థలాన్ని అభివృద్ధి చేశారు. దాతల సాయంతో ఆట స్థలాన్ని సిద్ధం చేశారు. విద్యార్థులు ఆటస్థలానికి రావడానికి సమస్య ఏర్పడడంతో మళ్లీ పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాల్సిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆటస్థలం వెళ్లేందుకు రోడ్డు వెంబడి నడుస్తున్న విద్యార్థులు

వ్యాయామ తరగతులకు దూరమవుతున్నాం..

ఆటస్థలం పాఠశాల సమీపంలో అందుబాటులో లేకపోవడంతో వ్యాయామ తరగతులకు దూరమవుతున్నాం. ప్రతిరోజు వ్యాయామానికి సమయం అందుబాటులో ఉన్నప్పటికీ పాఠశాల నుంచి చాలా దూరంలో ఆటస్థలం ఉండడంతో చిన్నచిన్న ఆటలకే పరిమితం కావాల్సి వస్తుంది. నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తే తరగతులకు, వ్యాయామానికి సమస్య ఉండదు. నూతన పాఠశాల భవనాలను త్వరగా ప్రారంభించాలి.

- జహీర్, 8వ తరగతి, చాపాడు హైస్కూల్

రోడ్డు దాటాలంటే భయంగా ఉంది..

ప్రస్తుత పాఠశాల దగ్గర నుండి నూతన పాఠశాల వరకు కిలోమీటర్ దూరం ఉంది. వ్యాయామం కోసం ఆ పాఠశాలకు వెళ్లాలంటే ప్రొద్దుటూరు-మైదుకూరు ప్రధాన రహదారి దాటుకొని నక్కలదిన్నె గ్రామానికి వెళ్లే మార్గంలో కిలోమీటర్ దూరం వెళ్లాలి. రోడ్డు దాటుకునే సమయంలో వాహనాలు నిత్యం ప్రయాణిస్తూ ఉండడం వల్ల భయంగా ఉంటుంది. ప్రతిరోజు ఆడుకోవాలని కోరిక ఉన్నా ఆటస్థలం లేకపోవడంతో వ్యాయామానికి దూరమవుతున్నాం.

- నరసింహ, 7వ తరగతి, చాపాడు హైస్కూల్

అవకాశం ఉన్నంతలో వ్యాయామ తరగతులు..

ప్రస్తుతం హైస్కూల్ ఆవరణలో ఆట స్థలం అందుబాటులో లేకపో వడంతో అందుబాటులో ఉన్న స్థలంలో అవకాశం ఉన్న ఆటలు ఆడిస్తున్నాం. నూతన హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు అవసరమైన ఆటస్థలం అందుబాటులో ఉంది. అవకాశం ఉన్నప్పుడు నూతన పాఠశాల ఆవరణకు తీసుకువెళ్లి వ్యాయామ తరగ తులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను ఆటస్థలానికి తీసుకు వెళ్లేందుకు సమస్యలు తలెత్తుతున్నాయి. వీలైనంత త్వరగా నూతన భవనాల్లోకి మారితే వ్యాయామానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

- ఓబయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు

నూతన పాఠశాల ఆవరణలో ఉన్న ఆటస్థలం

మైదుకూరు మండలం వనిపెంట వైద్యశాల

వైద్యులు అందుబాటులో లేక రోగులకు అవస్థలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో లేక వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య సిబ్బంది సమ్మె చేపడుతున్నారు. దీనితో కొంత మందిని వైద్యం కోసం ఇన్చార్జిలుగా నియమించారు. వీరు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తుండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యం కోసం వెళ్లిన రోగులకు ఓపి కాగితం మాత్రం తప్పకుండా సిబ్బంది ఇస్తున్నారు. ఓపి పొందిన తర్వాత గంటల తరబడి వేచి చూసి రోగులు ఓపిక లేక వెనుతిరిగి వెళుతున్నారు. ఓపి పుస్తకంలో మాత్రం పేర్లు నమోదు చేసుకొని సిబ్బంది వారు తమ పనిని సులభంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి రోగులకు వైద్య సేవలు అంది ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాట్లాడుతున్న ఎస్‌పి నచికేతన్ విశ్వనాథ్

అసాంఘిక కార్యకలాలు మట్కా, జూదం, అక్రమ మద్యం, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్‌పి నచికేతన్ విశ్వనాథ్ తెలి పారు. పులివెందుల డిఎస్‌పి కార్యాలయంలో శనివారం పులివెందుల సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ డివిజన్ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేద న్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్, సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ముద్దనూరు : గ్రామాల అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎం పిడిఒ ఆధ్వర్యంలో ఉప మండలాధ్యక్షులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు వారు చేపడుతున్న పనుల గురించి సమావేశంలో వివరించారు. సర్పంచులు, ఎంపి టిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన క్రిస్టియన్ కాలనీ ఏర్పాటుకు వినతి

వేముల : వేముల క్రిస్టియన్ కాలనీ వాసులకు నూతన కాలనీ ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు వినతిపత్రం అందజేశారు. శనివారం పులివెందుల ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంత్రి సవితను బీటెక్ రవి, వేల్పుల సొసైటీ కమిటీ మెంబర్ తొలి సాకు రాము, రాంపతాడు నాగేంద్ర బాబు కాలనీ వాసులు మంత్రిని కలిశారు. ప్రస్తుతం ఉన్న కాలనీ చాలా ఇరుకుగా ఉందన్నారు. మోటర్ బైక్ వెళ్లే దారి మాత్రమే ఉందన్నారు. కొత్త గృహాలకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అర్హత ఉన్న వారందరికీ పక్కాగృహాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మంత్రి సవిత మాట్లాడుతూ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన కాలనీ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : ఆటోడ్రైవర్లు వాహనమిత్రులకు అర్హత ఉండి అర్హుల జాబితాలో పేరు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్‌సిసిఆర్ కల్యాణమండపంలో ఆటో డ్రైవర్ల సేవలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైదుకూరు నాలుగు రోడ్ల కూడలి నుండి ఆటోలతో అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. రూ.17.18 కోట్ల మెగా చెక్కును ఆటో డ్రైవర్లకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపిడిఓలు శ్రీధర్ నాయుడు, దివిజా సంపతి, కనీస వేతనాల కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, నీటి పారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, సొసైటీ చైర్మన్ పాశం మారుతి, నాయకులు ధనపాల జగన్, వెంకట రమణారెడ్డి, పుట్టా ప్రభాకర్, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్

జిల్లాలో దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులపై చర్యలు తీసుకోవడంలో రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ, అధ్యక్ష కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ విమర్శించారు. శనివారం ప్రొద్దుటూరు కార్యాల యంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ పండుగ సీజన్‌లో విచ్చలవిడిగా బస్సు టికెట్లను అధిక మొత్తంలో ప్రజల వద్ద నుండి వసూలు చేస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని డిమాండ్‌ను పట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతున్నారని తెలిపారు. దీనిపై జిల్లాలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకో వడం లేదని వారు ప్రశ్నించారు. డివైఎఫ్ఐ అధ్వర్యంలో రవాణా శాఖ అధి కారులకు వినతిపత్రాలిచ్చినా స్పందన లేదన్నారు. బహిరంగంగా ఆన్‌లన్‌లో ఛార్జీలు రూ.2000, ఆ పైన రేట్లు చూపిస్తున్నా చర్యలు శూన్యమన్నారు. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నంకు ప్రయివేట్ బస్సు సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. ఇద్దరు డ్రైవర్లు ఉండాలని కానీ ఒక్క డ్రైవర్‌ను రూటు సర్వీసులకు తిప్పుతూ డ్రైవర్లుపైన ఒత్తిడి చేస్తు న్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడు స్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

జమ్మలమడుగు : దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యమేల అని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుభహన్ పేర్కొన్నారు. పండుగ సీజన్లో విచ్చలవిడిగా బస్సు టికెట్లను అధిక మొత్తంలో ప్రజల వద్ద నుండి వసూలు చేస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని డిమాండ్‌ను బట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతున్నా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ర్యాలీలో భూపేష్‌రెడ్డి, ఆర్‌డిఒ సాయిశ్రీ, కార్మికులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆటోడ్రైవర్లు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. శనివారం ఆటో ర్యాలీని భూపేష్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ జండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండ్, కన్నె లూరు మోటు వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. భూపేష్‌రెడ్డి ఆటో తోలుకుంటూ ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భూపేష్‌రెడ్డి, ఆర్‌డిఒ సాయిశ్రీ మాట్లాడారు. ఆటో కార్మికుల యూనియన్ నాయ కులు దాసు, లోకేష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో ఎంపీడీవో సయ్యద్ ఉన్నిసా, రామచంద్రారెడ్డి, ప్రొద్దుటూరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్య కర్తలు ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు, లేబర్ ఆఫీసు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగులో కార్మికుల సంక్షేమ బోర్డు, లేబర్ ఆఫీసు ఏర్పాటు చేయాలని సిఐటియు గౌరవ అధ్యక్షులు జి.ఏసుదాసు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిత్యం వేల సంఖ్యలో కార్మికులు పనులు చేస్తూ జీవన ఉపాధి పొందుతున్నారన్నారు. ఆయా రంగాల్లో ప్రమా దవశాత్తూ ఏదైనా జరిగితే.. వారికి గుర్తింపు కార్డు లేకపోవడం, కార్మికుల హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం వంటి కారణాలతో బెనిఫిట్స్ లేక పోవడం బాధాకర మన్నారు. లేబర్ ఆఫీస్ మళ్లీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ సిఐటియు నాయకులు ప్రసాద్‌రెడ్డి, నరేంద్ర, పాములేటి, రవి, బాషా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

వేంపల్లె: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర ఆటోడ్రైవర్లుకు ఎంతో ఆసరాగా ఉంటుందని పులివెందుల జనసేన సమన్వయ కర్త డాక్టర్ హరీష్ చెప్పారు. శనివారం స్థానిక నాలుగు రోడ్లలో ఉన్న ఆటోడ్రైవర్లుతో కలిసి వాహనమిత్ర పథకంపై హరీష్ అడిగి తెలుసుకున్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్‌కు ఎడాదికి రూ.15 వేలు టిడిపి కూటమి ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పారు. ఆటోడ్రైవర్లు చాలా ఆనం దంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇడుపులపాయ నాయ కులు పోతిరెడ్డి జయచంద్ర, లక్ష్మణ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లికార్జున, శ్యాం, దేవా, మనోజ్ పాల్గొన్నారు.

ప్రజాప్రయోజన పనులకు ప్రాధాన్యత

మాట్లాడుతున్న కార్యదర్శి శంకరమ్మ

ప్రజాశక్తి - ఖాజీపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రజా ప్రయోజన పనులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తామని పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ తెలిపారు. శనివారం గ్రామ సచివాలయ కార్యాలయంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరం పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలవల అభివృద్ధి, పూడికతీత పనులు, రహదారికి ఇరువైపులా కంప చెట్ల తొలగింపు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శంకరమ్మ పాల్గొన్నారు.

ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఇకెవైసి అప్డేట్ చేస్తున్న ఎపిఒ జయభారతి

ఉపాధి హామీ చట్టంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఫేస్ ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీవో జయభారతి సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి పనులు గుర్తింపు, ఆమోదంపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇకెవైసి చేయించుకోకపోతే పని బుక్ తొలగిపోతుందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో మూడు రోజులపాటు ఇకెవైసి ఫొటో అప్డేట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబు కార్డు దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మండలం గంజికుంట, వనిపెంట సచివాలయాలలో శనివారం ఉపాధి గ్రామసభను ఏపీఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జయభారత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్ల వెంబడి కంపచెట్ల తొలగింపు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనులను చేయాలన్నారు. ఏపీఓ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులను గుర్తిస్తున్నామన్నారు. గ్రామసభల ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులను వారిని అడిగి తెలుసుకుం టున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ జయ భారత్‌రెడ్డి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇర్ఫాన్‌బాషా

ప్రజాస్వామ్య పరిరక్షణ నిజమైన దేశ సేవ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్య పరిరక్షణ నిజమైన దేశ సేవ అని, ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో స్ఫూర్తి పొంది, పిసిసి ప్రెసిడెంట్ షర్మిల పిలుపుమేరకు శనివారం మండల పరిధిలోని గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఓటు చోరీలు దేశానికి ప్రమాదమన్నారు. రాజ్యాంగాన్ని రక్షించడం అంటే ప్రజల హక్కులను కాపాడటమేనని తెలిపారు. ఓటు దొంగ.. గద్దె దిగు అనే నినాదంతో ఇంటింటికి వెళ్లి ప్రజల్లో ఓటు చోరీలపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించి ఎన్నికల వ్యవస్థలో అక్రమాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రేరేపించారు. భగత్‌సింగ్ కాలనీలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలచే నీరాజనాలు అందుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, డిసిసి కార్యదర్శి, నాయకులు మౌలాలి, సలందర్ గౌస్, చెన్నూర్ అబ్బాస్, స్థానికులు పాల్గొన్నారు.

టిడిపి కూటమి, వైసిపి దొందూదొందే

ప్రజాశక్తి - వేంపల్లె

మద్యం పాలసీ విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం, వైసిపి దొందూదొందేనని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైసిపి, ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వాలు వేరైనా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా చేశాయని విమర్శించారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులు అన్న విధంగా మద్యం పాలసీ తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిఘా నిర్లక్ష్యం కారణంగా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు విచ్చలవిడి అయి నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఉన్న మొలకలచెరువు మండల కేంద్రం వద్ద ఎక్సైజ్ అధికారులు నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి చేసి రూ,1 కోటి 75 లక్షలు విలువచేసే నకిలీ మద్యం తయారు చేసే పరికరాలు, 9 మంది కూలీలతోపాటు నకిలీ మద్యం అమ్ముతున్న ఓ బ్రాందీ షాపు యజమానిని అరెస్టు చేశారన్నారు. మద్యం మత్తులో రాష్ట్రంలో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నట్లు వివరించారు. బెల్ట్ షాపులను పూర్తిగా అరికట్టాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఓట్ల దుర్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రామ సుధాకర్‌రెడ్డి

ఓటర్ల జాబితా అవకతవకలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్ గద్దీ చోడ్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామసుధాకర్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ ప్రజల ఓట్లను దోచుకోని గద్దెనెక్కిందన్నారు. దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంలో జరుగుతున్న ఓట్ల చోరీ అంశాన్ని పకడ్బందీ సాక్షాదారాలతో దేశ ప్రజల ముందు ఉంచారన్నారు. ముఖ్యంగా యువత మేధావి వర్గం దీనిపైన దృష్టి పెట్టి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు పవిత్రతను కాపాడాలన్నారు.

ఎఎన్ఎంలు జాగ్రత్తలు పాటించాలి

ఎర్రగుంట్ల : పిల్లలకు టీకాలు వేసేటప్పుడు ఎఎన్ఎంలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ సూచించారు. అర్బన్ వైద్యశాలలో శనివారం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారాల్లో పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. పొరపాట్లు దొర్లకొండా టీకాలు వేసే సమయంలో బాధ్యతగా వ్యవహ రించాలన్నారు. రికార్డులను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మునిరెడ్డి, స్థానిక వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఏటూరు కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామ సమీపంలో ఏటూరు కాలువ వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపిన మేరకు వివరాలు.. 50 ఏళ్ల పైబడిన ఆచూకీ తెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతదేహం బాగా కుళ్లడంతో ముఖం కనిపించడం లేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వే గేటు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద కొండాపురం వెళ్లే రైలు మార్గం పట్టాలపై శనివారం ఉదయం తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ హౌస్ ఆఫీసర్ నాగాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల నుండి గుంతకల్ వైపు వెళుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన టికెట్ లభించిందన్నారు టీషర్ట్ ముందు భాగాన నారాయణ మెడికల్ కాలేజి 2020 అని ఉందన్నారు. వెనుక భాగంలో చేతన్ అని రాసి ఉందన్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు